క్లుప్తంగా

ఎమ్మెల్యే ఆర్కే సొంత నిధులతో రోడ్డు నిర్మాణం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సొంత నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. స్థానిక మహిళల అభ్యర్థన మేరకు పలు ప్రాంతాల్లో గ్రావెల్ రోడ్ నిర్మాణాలు చేపట్టారు. వీటితో పాటు గ్రామంలో వున్న ముస్లిం బరియల్ గ్రౌండ్‌కు వెళ్లే మార్గంలోను, కృష్ణుడి విగ్రహం వద్ద గ్రావెల్ ఫిల్లింగ్ చేపట్టారు.

ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సాయం

మంగళగిరి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ బాలునికి వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించారు. నగరంలోని కొత్తపేటకు చెందిన గాలి మనోహర్‌కు వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మహిళా నేతలు మల్లవరపు సుధారాణి, సంకె సునీత అందజేశారు.

మృతురాలి కుటుంబానికి..

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన మృతురాలి కుటుంబ సభ్యులకు శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ప్రకటించిన రూ.20వేల ఆర్థిక సహాయాన్ని ఎంపీపీ డి.సంతోషరూపవాణి, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, గ్రామ సర్పంచి ఉన్నం ఝాన్సీ, ఎంపీటీసీ షేక్ సుభాని, తుమ్మపూడి సర్పంచి షేక్ అజీజున్ పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల తనిఖీ

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్‌లోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ డీఐ ఎండీ ఖాసిం తనిఖీ చేశారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. పాఠశాలలో విద్యార్థులు నూటికి నూరుశాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన పాఠశాల హెచ్‌ఎం సాదుల్లాఖాన్‌ను అభినందించారు.

అభివృద్ధి పనులు పరిశీలన

మంగళగిరి: దాతల సహకారంతో దేవస్థానం అభివృద్ధికి పాలకవర్గ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. నగరంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో చేపట్టిన ఫ్లోరింగ్ పనులను బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో దేవస్థాన ట్రస్టు బోర్డ్ చైర్ పర్సన్ నేరెళ్ల లక్ష్మీ రాధిక, ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సంకా బాలాజీ గుప్తా, నేరెళ్ల మురళి పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

తాడేపల్లిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న మద్యాన్ని పెనుమాక గ్రామంలో బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. పెనుమాకకు చెందిన పలగాని రంగబాబు మద్యం అమ్ముతున్నాడని అందిన సమాచారం మేరకు అతడి ఇంట్లో తనిఖీ చేయగా 17 క్వార్టర్ బాటిళ్లు లభించినట్లు చెప్పారు. నిందితుడి పరారయ్యాడని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

రూ.49.50 లక్షలతో రోడ్డు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో రూ.49.50 లక్షలతో నిర్మిస్తున్న బీటీ రోడ్ పనులను బుధవారం కార్పొరేషన్ డి.ఇ. కృష్ణారెడ్డి పరిశీలించారు. వడ్డేశ్వరం రాధారంగా నగర్‌లో శివభాస్కర ఎన్‌క్లేవ్ నుంచి వడ్డేశ్వరం జిల్లాపరిషత్ రోడ్డు వరకు 400 మీటర్ల పొడవున 5 మీటర్ల వెడల్పున రోడ్ నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు.

ముళ్ల పొదలు తొలగింపు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ కొలనుకొండులోని విశ్వబ్రాహ్మణ శ్మశాన వాటిక, ముస్లిం బరియల్ గ్రౌండ్‌లో బుధవారం పొదలు తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. త్వరలో ఈ రెండు శ్మశానవాటిల్లో గ్రావెల్ ఫిల్లింగ్ చేపట్టనున్నట్లు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ క్రాంతి తెలిపారు.

జూదరుల అరెస్టు

పెదకాకాని: మండలంలోని కొప్పురావూరు శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం రాత్రి దాడులు చేశారు. పది మందిని అరెస్టు, వారి నుంచి రూ. 36 వేలు స్వాధీనం చేసుకున్నారు. మరి కొందరు పరారీ అయ్యారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

ఆలయ కమిటీకి సత్కారం

పాత గుంటూరు: ఆర్. అగ్రహారంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ట్రస్టు బోర్డ్ నూతన కమిటీ అభినందన మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ ముస్తఫా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ మర్యాదలతో నూతన కమిటీకి ఘన స్వాగతం పలికారు. కమిటీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించింది. అనంతరం ఆలయ ప్రాంగణంలోని వేదికపై జరిగిన సభలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నిడమానూరి సురేష్, సభ్యులు కొలిశెట్టి రమాదేవి, కనమర్లపూడి మారుతి శివ వెంకట సుబ్బారావు, బైసాని ఇందువతి, దేవరశెట్టి సురేష్‌బాబును పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొప్పురావూరి రజని, కార్పొరేటర్ ఎస్. శ్రీనివాసరావు, సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్ కమాండెంట్ సుబ్బారెడ్డి

మంగళగిరి: యోగతో శారీరక, మానసిక ఆరోగ్యం సాధ్యమని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ కమాండెంట్ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని బెటాలియన్‌లో ప్రత్యేక శిక్షణ శిబిరం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ ఈఎస్ సాయిప్రసాద్, అసిస్టెంట్ కమాండెంట్లు మురళీ కృష్ణ, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

శ్రీరాధా కృష్ణ యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో...

ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరానికి చెందిన శ్రీ రాధాకృష్ణ యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో నగరంలోని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. సేవాకేంద్రం వ్యవస్థాపకులు పడమట రాధాకృష్ణ యోగి గురూజీ ఆధ్వర్యంలో యోగా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పంచమర్తి ప్రసాద్, తుల్లిమిల్లి రామకృష్ణ, భాను కిషోర్, యోగా సేవా కేంద్రం ప్రతినిధులు శిరందాసు హేమ సుందరరావు, జంజనం హనుమంతరావు, లక్ష్మి, ఉడతా సామ్రాజ్యం పాల్గొన్నారు.

శ్రీనగర్ కాలనీ రామాలయంలో...

కార్పొరేషన్ పరిధి యర్రబాలెం శ్రీనగర్ కాలనీ రామాలయంలో అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యోగా గురువు పలగాని చంద్రశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో యోగ సాధకులు ఎ.ఉమామహేశ్వరరావు, పి.కోటేశ్వరరావు, రఘు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లోను, దుగ్గిరాల మండల పరిధిలో పలుచోట్ల అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వడ్డేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాలలో యోగాసనాలపై కేఎల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, కేఎల్‌యూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్రీకాంత్ రెడ్డి, సీఈఏ కో ఆర్డినేటర్ జీవీకేపీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణాకెనాల్ జంక్షన్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గోడౌన్‌లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ దుష్యంత్ హాజరయ్యారు. ఏజీఎం (క్యూసి) మనోజర్‌కుమార్ సింగ్, తాడేపల్లి కృష్ణాకెనాల్ జంక్షన్ డిపో మేనేజర్ జి.సుకుమార్, మేనేజర్ (క్యూసి) శశికళ, మేనేజర్ (క్యూసి) ఇ.రాంప్రసాద్, యోగ మాస్టర్ వెంకట్ పాల్గొన్నారు.



తుళ్లూరు కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల యోగా సాధన



ఆరో ఏపీఎస్పీ బెటాలియన్‌లో యోగాసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది



ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కార్యాలయం వద్ద యోగాసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది



యోగా అభ్యసిస్తున్న జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వేద విద్యార్థులు



యర్రబాలెం శ్రీనగర్ కాలనీలో యోగాసనాలు వేయిస్తున్న యోగాచార్యులు

కేఎల్‌యూలో...

కేఎల్ విశ్వవిద్యాలయంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇషా ఫౌండేషన్ మెంటార్ జగదీష్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రొ వీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్లానింగ్ మరియు అభివృద్ధి డీన్ డాక్టర్ వి.రాజేష్, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ చప్పిడి హనుమంతరావు, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, క్రీడల అసోసియేషట్ డీన్ డాక్టర్ కె. హరికిషోర్, యోగా గురువులు హరిపోతులూరు, ఎం.పూజిత, ఎన్‌సీసీ కల్నల్ మౌనిక, సాక్ సమన్వయకర్తలు సత్యనారాయణ, వంశీ పాల్గొన్నారు.

జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో.....

దుగ్గిరాలలో డాక్టర్ కేఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.గిరిధరరావు, వైస్ ప్రిన్సిపాల్ టి.రాఘవరెడ్డి, కేఎస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సరళాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాంబాబు పాల్గొన్నారు.

ఉండవల్లి గుహల వద్ద....



తాడేపల్లి పట్టణ పరిధిలోని ఉండవల్లి అమరావతి రహదారిలోని ఉండవల్లి గుహల వద్ద ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా ట్రైనర్ ఆత్మకూరి కొండయ్య ఆధ్వర్యంలో యోగిలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా ఏఈ భాను ప్రకాష్, సీఏ నాగేంద్రకుమార్, మంగళగిరి సబ్ డివిజన్ పోస్ట్ ఆఫీస్ ఏఎస్‌పీ శ్రీనివాసరావు, హెడ్ పోస్ట్‌మాస్టర్ నరసింహారెడ్డి, తాడేపల్లి పోస్ట్‌మాస్టర్ వై.నాగరాజు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తాడికొండలో..

తాడికొండ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని తాడికొండ, తుళ్ళూరు మండలాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాడికొండ బీఎస్ఎస్‌బీ కళాశాల, లాం చలపతి ఇంజినీరింగ్ కళాశాలు, తుళ్లూరు కేవీఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్, రాయపూడి మెయిన్స్ పాఠశాల్లో విద్యార్థులతో యోగాసనాలు వేయించి యోగా ఆవశ్యకతపై వివరించారు.

యోగాతోనే నిత్య ఆరోగ్యం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సీతారామ స్వామి దేవస్థానంలో యోగ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు జి.చంద్రశేఖర్ ప్రారంభించారు. యోగ గురువు కేశవరెడ్డి మాట్లాడుతూ యోగా ద్వారా నిత్య ఆరోగ్యం గా ఉండవచ్చని చెప్పారు.

ఎన్నారై వైద్య కళాశాలలో...

కార్పొరేషన్ పరిధి చినకాకాని ఎన్నారై వైద్య కళాశాలలో యోగ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో యోగ ఆవశ్యకత ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శివ ప్రబోధ్, పీడీ గురునాథం, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 400 మంది విద్యార్థులు యోగాసనాలు ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు.

నాగార్జునా హైస్కూల్‌లో...

కార్పొరేషన్ పరిధి పెదవడ్లపూడి నాగార్జున హైస్కూల్ ఆవరణలో ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక యోగా శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి వరల్డ్ రీడర్ సంస్థ ప్రతినిధి ప్రదీప్ కుమార్, పారిశ్రామికవేత్త పీఎం రెడ్డి, రిటైర్డు అగ్రికల్చరల్ అధికారి పుల్లం రాజు, యోగ గురూజీ రంగలత, స్కూల్ డైరెక్టర్ రాఘవయ్య, ప్రిన్సిపాల్ మాధవి పాల్గొన్నారు.

పది కంప్యూటర్ల బహూకరణ

మంగళగిరి: మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పరిధి నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి, ఎన్నారై కొండా చంద్రశేఖర్ రెడ్డి పది కంప్యూటర్లను బహూకరించారు. బుధవారం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల రిటైర్డు హెచ్‌ఎం భీమిరెడ్డి శివారెడ్డి చేతుల మీదుగా కంప్యూటర్లను అందజేశారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజీవ్ రత్న మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివి విదేశాల్లో స్థిరపడిన ఎన్నారై, రూరల్ హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొండా చంద్రశేఖర్ రెడ్డి పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ విద్యనందించాలనే లక్ష్యంతో రూ.2లక్షలతో కంప్యూటర్లను అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జేమ్స్, వాణి, లక్ష్మి, శ్రీనివాసరావు, రవి, శంకర్, రాజారెడ్డి, శేఖర్, శ్రీనివాసరెడ్డి, రజని, పద్మజ, శ్రీలక్ష్మి, కంప్యూటర్ ఆపరేటర్ సుబ్బారావు పాల్గొన్నారు.

ఆర్‌బీఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు



ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: భారతీయ రిజర్వ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల క్విజ్ పోటీలు బుధవారం నిర్వహించారు. తాడేపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు జిల్లా స్థాయి పోటీలకు బుధవారం ఎంపికయ్యారు. తాడేపల్లి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ శ్రీమతి ఎన్. మాధురి మాట్లాడుతూబ్యాంకింగ్, ఆర్థిక సేవల కార్యకలాపాలపై విద్యార్థి స్థాయి నుంచే అవగాహన కల్పించాలనే ముఖ్య ఉద్దేశంతో క్విజ్ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. సాహితి, హర్షిణి మండల స్థాయి పోటీలలో ప్రథమ బహుమతిని గెలుపొంది జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 28వ తేదీ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనన్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినులను, గైడ్ టీచర్ తుర్లపాటి అనిల్‌కుమార్‌ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీమిరెడ్డి తాతిరెడ్డి, ఉపాధ్యాయులు పద్మావతి, కోటేశ్వరరావు, నాగేషు, ఇర్ఫాన్ అభినందించారు.

ఘనంగా దత్తసాయి ఆలయ వార్షికోత్సవం



శ్రీసాయిబాబాకు అభిషేకం

ఈమని(తెనాలి): దుగ్గిరాల మండల గ్రామం ఈమనిలోని శ్రీదత్తసాయి ప్రేమమందిరం 17వ వార్షిక ప్రతిష్ట వార్షికోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. చివరిరోజున సాయిబాబాకు విశేష అభిషేకాలు, సాయి మంత్ర జప తర్పణ హోమాలు జరిపారు. మధ్యాహ్నం 1.30 గంటల్నుంచి అన్నప్రసాద వినియోగం చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా రాత్రి 8.30 గంటల్నుంచి శ్రీమహానందీశ్వర నాట్యమండలి, తెనాలి వారిచే 'పాండవోద్యోగం' నుంచి పాన్పు సీను, 'శ్రీరామాంజనేయ యుద్ధం' ప్రదర్శించారు. ఈనెల 19 నుంచి ఆరంభమైన ఉత్సవాల్లో తొలిరోజున సంప్రదాయ భజనలు చేశారు. మంగళవారం శ్రీసాయి సచ్చరిత్ర పారాయణం చేశారు. శ్రీదత్తసాయి ప్రేమమందిరం, శ్రీఅన్నపూర్ణ ఉచిత హోమియో వైద్యసేవా కేంద్రం, శ్రీకొర్రపాటి అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో ఈ వేడుకలు నిర్వహించారు.

అందరికి సమన్యాయమే జగనన్న లక్ష్యం

- వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త సురేష్‌కుమార్
- రేపుడిలో గడప గడపకు మన ప్రభుత్వం



పథకాలను వివరిస్తున్న నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

ఫిరంగిపురం: రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి సమన్యాయమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని రేపూడిలో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జోరు పడుతున్న వర్షంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. కుటుంబానికి చేసిన లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల వారి సంక్షేమం కోసం ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెట్టిందని వాటిని నూటికి నూరుశాతం సక్రమంగా అమలు చేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. జగనన్న ఆణిముత్యాలు ప్రవేశపెట్టి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించేలా వారికి అవార్డులు,నగదు బహుమతులు అందజేసి వారిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, సర్పంచి చిట్టా అంజనీదేవి, చిట్టా అంజిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, వైస్ ఎంపీపీ జి.చంద్రం, పి.జేమ్స్ ఇన్నయ్య, పి.మరియబాబు, కె.చిన్నప్పరెడ్డి, షేక్.అబ్దుల్ గఫార్, పి.రఘు, బి.శ్రీనివాసరెడ్డి, బలరామిరెడ్డి, చిట్టా కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, పిచ్చిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ఎంఈఓలు బాధ్యతల స్వీకారం

తాడికొండ: తాడికొండ, తుళ్లూరు ఎంఈఓ- 2 డి.ప్రభాకర్, వి.రాజశేఖర్ బుధవారం ఆయా మండలాల విద్యా వనరుల కార్యాలయాల్లో బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో రెండు మండలాల ఎంఈఓలు తెనాలి ఇందిర, గద్దె కోటేశ్వరరావు, తాడికొండ మండల ఎస్టీయు అధ్యక్షులు బి.కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆరుద్ర వీరయ్య, నాయకులు బసవయ్య, శివారెడ్డి, అస్సలామ్, జి.వెంకటరావు, తుళ్లూరు మండలం యూటీఎఫ్ మండల అధ్యక్షులు ఎ.రఘునాథ్, ప్రధాన కార్యదర్శి టి.భాస్కరావు, రాష్ట్ర ప్రచురణల విభాగం సభ్యులు యు.రాజశేఖర్, జిల్లా కార్యదర్శి సీహెచ్ ఆదినారాయణ, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ అడివి శ్రీనివాసరావు అభినందించారు.

ఫిరంగిపురం ఎంఈఓ-2గా రవికాంత్ ..

ఫిరంగిపురం: మండల ఎంఈఓ-2గా బుధవారం సీహెచ్ రవికాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఇష్టంగా పనిచేసి విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. రవికాంత్‌ను ఎంఈఓ సాల్మన్‌రాజు అభినందించారు.

నా అస్థికలను గంగానదిలోనే కలపండి..

ఆత్మహత్య చేసుకున్న వృద్ధురాలి చివరి కోరిక



ఆత్మహత్య చేసుకున్న వృద్ధురాలు రమాదేవి

తాడేపల్లిరూరల్: నేను చనిపోయిన తరువాత నా అస్థి కలను గంగానదిలో కలపండి అదే నా చివరి కోరిక అంటూ ఓ వృద్ధురాలు ఆత్మహత్య లేఖరాసి చీరతో తాను నివాసముంటున్న ప్లాటులో బుధవారం ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ వినోద్ తెలిపిన వివరాలు.. తాడేపల్లి రూరల్ పూజిత వాటర్ ఫ్రెంట్ అపార్ట్‌మెంట్‌లో నివాసముండే చారుపల్లి చిన సుబ్రహ్మణ్యం, రమాదేవి (61) భార్యాభర్తలు. రమాదేవికి కొంతకాలంగా ఆరోగ్యం సరిగా లేకపోవడం, ఎక్కడ చూపించినా కుదుట పడకపోవడంతో బతికి ఉండి ఈ కష్టాలు పడడం ఎందుకని మనస్తాపం చెంది, నా చావుకు ఎవరూ కారణం కాదు, నా అస్థికలను గంగానదిలో కలపండి అంటూ తన అనారోగ్య సమస్యలను తెలియజేస్తూ లేఖ రాసి ఆత్మహత్య చేసుకుంది. జరిగిన ఈ ఘటనపై రమాదేవి కుమారుడు వంశీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్టు

గుంటూరు ఈస్ట్: గంజాయి విక్రయిస్తున్న మహిళపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శశాంక్ గోయల్ కాలనీలో బేబి గంజాయి విక్రయిస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం దాడి చేసి ఆమెను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఆమె నుంచి కేజీ వంద గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్, రూ. 1500 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న వ్యక్తులు..

సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. బ్రాడీపేట వాటర్ ట్యాంకుల సమీపంలో సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం దాడి చేశారు. మల్లెబోయిన శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతని వద్ద నుంచి రూ. 3,400తో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నపై తమ్ముడు దాడి

పట్నంబజారు: అన్నపై తమ్ముడు కత్తితో దాడి చేసిన సంఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాచిరాజు వీధిలో నివాసం ఉండే భాస్కర్‌రెడ్డిపై అతని సోదరుడు నరేంద్రరెడ్డి కుటుంబ కలహాల నేపథ్యంలో కత్తితో దాడి చేసి గాయపరిచాడు. బుధవారం వారి తండ్రి వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

చేబ్రోలు: ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని అదృశ్యంపై బుధవారం చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు ప్రెసిడెన్సీ హైస్కూల్ సమీప ప్రాంతానికి చెందిన చందు మోనీషా గుంటూరు చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. మంగళవారం రాత్రి ఇంటి నుంచి అదృశ్యమైంది. తల్లిదండ్రులు బంధువులు సమీప ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి

డెప్యూటీ డీఈఓ వెంకటేశ్వరరావు



జగనన్న కిట్లు పరిశీలిస్తున్న డెప్యూటీ డీఈఓ పి.వెంకటేశ్వరరావు

ఫిరంగిపురం: విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డెప్యూటీ డీఈఓ పి.వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్‌పాల్స్ హైస్కూల్, సెయింట్ ఆన్స్ తెలుగు మీడియం పాఠశాలలను బుధవారం పరిశీలించారు. క్లాసురూంలోకి వెళ్లి విద్యార్థులకు ఇటీవల అందజేసిన జగనన్న విద్యా కానుకను పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులకు టీఎల్ఎం(టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్)తో గణిత బోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలులో భాగంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల శాతం పెంచాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. సమావేశంలో ఉర్దూ డీఐ ఖాసిం, రెండో ఎంఈఓ సీహెచ్ రవికాంత్, హెచ్‌ఎంలు సిస్టర్ వి.తెరసమ్మ, శౌరయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం

- ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు
- దివ్యాంగులకు స్కూటీల పంపిణీ



దివ్యాంగులకు బైక్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: సమాజంలో దివ్యాంగులు ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు దివ్యాంగులకు త్రిచక్ర స్కూటీలను బుధవారం అందజేశారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దివ్యాంగులకు పూర్తి స్థాయిలో అండగా ఉండాలనే ఉద్దేశంతో నవరత్నాలు పథకాల్లో భాగంగా త్రిచక్ర స్కూటీలను అందజేయడం జరుగుతుందన్నారు. అర్హులైన దివ్యాంగులు ఇంకా ఎవరైనా ఉన్నట్లయితే త్రిచక్ర స్కూటీలకు వలంటీర్ల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ మేకతోటి అరుణ, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు సంకె సునీత పాల్గొన్నారు.

26న కెమిస్ట్రీ గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

నగరంపాలెం: ప్రభుత్వ మహిళా కళాశాలలో ఖాళీగా ఉన్న రెండు కెమిస్ట్రీ లెక్చరర్ (గెస్ట్ ఫ్యాకల్టీ) పోస్టులకు ఈనెల 26న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఆర్. జ్యోత్స్నకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు సాంబశివపేటలోని కళాశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అభ్యర్థులకు పీజీలో 55 శాతం పైబడి మార్కులు ఉండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని ఆమె తెలిపారు. ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరవ్వాలని ప్రిన్సిపాల్ సూచించారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

కొండేపాడు (ప్రత్తిపాడు): విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ దాసరి అన్నమ్మ అన్నారు. మండల పరిధిలోని కొండేపాడు ఎల్ఈ ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న దాసరి అక్షయ ఏపీఆర్ఎస్ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష పరీక్షలో వందకు 74 మార్కులు సాధించి, జిల్లా స్థాయిలో 73వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా బుధవారం స్థానిక పాఠశాలలో హెచ్‌ఎం శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ అన్నమ్మ అక్షయను దుశ్శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వై.ఎస్. జగన్ చిత్తశుద్ధితో విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారని చెప్పారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పరీక్షకు మొత్తం 2300 మంది విద్యార్థులు హాజరవ్వగా తమ విద్యార్థి వందలోపు ర్యాంకు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులు దాసరి చెంచు రామారావు, ఉపాధ్యాయులు కె. శ్రీనివాసరావు, అంగన్ వాడీ కార్యకర్త వై.యశోద పాల్గొన్నారు.